ARK MEDIA
SUBSCRIBE

TS 24 0026809

# నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం
ఎడిటర్ : కనుకుల అనంతరెడ్డి
జాతీయ తెలుగు దినపత్రిక
www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 153 | బుధవారం, జూన్ 24, 2026 | పేజీలు : 02 | వెల రూ. 1.00/-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...

నియోజకవర్గ ఇంచార్జ్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 94932 72754

# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి






**అన్ని పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాలు శుభ్రంగా ఉండాలి**

**విద్యార్థులు 100 శాతం హాజరు అయ్యేలా చూడాలి**

**ప్రత్యేక అధికారులు హాస్టళ్లలో షెడ్యూల్ ప్రకారం తనిఖీ చేయాలి**

**ప్రభుత్వ పాఠశాలలు, అన్ని సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయాల అధికారులతో ఐడీఓసీలో సమీక్ష సమావేశం**

**నేటి ప్రభాతదర్శిని రాజన్న సిరిసిల్ల, జూన్ -23**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం, విద్యార్థుల హాజరు, పరిశుభ్రత తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ గురుకులాలు, గురుకుల విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాల జిల్లా బాధ్యులు, జిల్లా విద్యాధికారి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య, హాజరు శాతంపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి పాఠశాల, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తప్పనిసరిగా ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. దీని కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆహార పదార్థాలు జాగ్రత్తగా భద్రపర్చాలని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఆహార పదార్థాలు సరఫరా చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాలు పరిశుభ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. దీని పై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సూచించారు. అన్ని విద్యాలయాల్లో విద్యార్థులు 100 శాతం హాజరు అయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం విద్యా బోధన చేయాలని తెలిపారు. గతంలో నియమించిన ప్రత్యేక అధికారులు షెడ్యూల్ ప్రకారం తమ పరిధిలోని పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, డీటీడబ్ల్యూఓ సంగీత, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష, ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాళ్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదవాడికి ఒకపూటైనా కడుపునిండా భోజనం అందిద్దాం

**దాతల సహకారంతో 1900 రోజులుగా అన్నార్తులకు పేదలకు అన్నదనం**

**అన్నపూర్ణే! సదాపూర్ణే! శంకర ప్రాణ వల్లభే! జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహీచ పార్వతి**

**నేటి ప్రభాతదర్శిని వేములవాడ జూన్ 23 :**



మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1900 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజున లక్ష్మీగణపతి రాజన్న భీమేశ్వర ఆలయం వద్ద పేదలకు అన్నార్తులకు అన్నదాన కార్యక్రమంతో పాటు వాటర్ బాటిల్స్ పంపిణీ చేయడం జరిగిందని నేటి అన్నదాత లుగా కీ శే.ఆకుల నరేష్ కుమార్ మొదటి నెల తిథి సందర్భంగా వీరి అమ్మ ఆకుల భారతి తమ్ముడు మరదలు ఆకుల సురేష్ సంజన దంపతులు అమెరికాలో పుట్టినరోజు జరువుకుంటున్న జెరిపోతుల యువన్ పుట్టినరోజు సందర్భంగా అమ్మ నాన్న సుమమ్ సౌమ్య దంపతులు, తాతయ్య నానమ్మ విజయలక్ష్మి సాంబయ్య, అమ్మమ్మ తాతయ్య గవిని రమాదేవి వేణు దంపతులు శాశ్వతదాతలుగా డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు స్నేహలత దంపతులు, ప్రతాప స్వప్న సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్చంద్ర దంపతులు శిరీష సాయిచంద్ర దంపతులు శర్వాణి రవిచంద్ర దంపతులు హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయి కృష్ణ ఉన్నారని, పుట్టిన, పెళ్ళిరోజు మరియు ఇతరత్ర కార్యక్రమాలకు పేదలకు అన్నార్తులకు ఒక్క పూట అన్నదానం చేయలను కునే దాతలు ట్రస్టు సభ్యులను గాని ట్రస్ట్ నంబరు 92469 39388 కు సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. నేటి కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్ సగ్గు రాహుల్ పసుల శ్రీధర్ మఠం శివకుమార్ పాశం భాస్కర్ రెడ్డి మరియు పంబి కృష్ణ తదితరులు పాల్గొన్నారు



# ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి





**మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వీర్నపల్లి కేజీబీవీ లో తనిఖీ**

**నేటి ప్రభాతదర్శిని వీర్నపల్లి, జూన్ -23**

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. అక్కడి నుంచి కిచెన్ లోకి వెళ్లి బియ్యం నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ చార్ట్ ప్రకారం ఈ రోజు ఏ ఏ ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నారో పరిశీలించారు. స్టోర్ రూమ్ లో పప్పులు, నూనె, నెయ్యి, ఇతర పదార్థాల నాణ్యత, గడువు తేదీని తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నిల్వకు సంబంధించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు కచ్చితంగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... విద్యార్థులు అందరూ తరగతులకు హాజరయ్యాలా చూడాలని సూచించారు. విద్యార్థులు ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలు శ్రద్ధగా చదువుకోవాలని తెలిపారు. పరిశీలనలో మండల ప్రత్యేక అధికారి క్రాంతి, తహసీల్దార్ నారాయణ రెడ్డి, సర్పంచ్ జ్యోత్స్న తదితరులు ఉన్నారు.





# ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ

**బీబీనగర్ 46 పోలింగ్ కేంద్రాలకు బిఎల్‌వోల నియామకం**

**హైదరాబాద్,జూన్23(నేటి ప్రభాతదర్శిని):**

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు బీబీనగర్ మండలంలోని 46 పోలింగ్ కేంద్రాలకు బూత్ లెవల్ అధికారులను (బీఎల్‌వోలు) నియమించినట్లు తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఎల్‌వోల పనితీరును పర్యవేక్షించేందుకు నలుగురు బీఎల్‌వో సూపర్‌వైజర్లను నియమించినట్లు పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ మేరకు జూన్ 25 నుండి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్లు చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు వివరాల సవరణలు, చిరునామా మార్పులు, కుటుంబ సభ్యుల వివరాల ధృవీకరణ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. మండలంలోని గూడూరు, జైనపల్లి, కొండమడుగు, జియ్యాపల్లి, మహాదేవ్‌పూర్, రాయరావుపేట, నేమారుగొమ్ముల, వెంకిర్యాల, రుద్రవెల్లి, రాఘవాపురం, బ్రాహ్మణపల్లి, భట్టుగూడెం, బీబీనగర్‌తో పాటు వివిధ గ్రామాల్లో ఈ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమకు సంబంధించిన బీఎల్‌వోలను సంప్రదించి ఓటరు జాబితాలో అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# రైతు ముంగిట నాణ్యమైనా విత్తనాలు

### కోనాపూర్‌లో విత్తన మేళా ప్రారంభం



**నేటి ప్రభాత దర్శిని బాన్సువాడ ప్రతినిధి.**

ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని బాన్సువాడ మండలం కోనాపూర్ రైతు వేదికలో ఆదివారం "రైతు ముంగిట నాణ్యమైన విత్తనాలు – విత్తన మేళా" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వర్చువల్‌గా ఈ మేళాను రాష్ట్రంలో ప్రారంభించారు.కోనాపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తనా మేళాను ప్రజాప్రతినిధులు, రైతులు సందర్శించారు. వివిధ కంపెనీల విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాల స్టాళ్లను పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులు విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.

**7 వరి వంగడాలకు బోనస్**

ఈ సందర్భంగా అధికారులు రైతులకు కీలక సూచనలు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో తెగుళ్ల తాకిడిని తట్టుకుని అధిక దిగుబడి వచ్చే KNM 1638, BPT 5204, HMT సోనా, WGL-44, JGL 1798, తెలంగాణ సోనా అనే 7 రకాల వరి వంగడాలు సాగు చేయాలని సూచించారు. ఈ 7 రకాల వంగడాలు మాత్రమే సాగు చేసిన రైతులకు ప్రభుత్వం బోనస్ కింద క్వింటాలుకు ?500 అదనంగా చెల్లిస్తుందని తెలిపారు. అలాగే నానో యూరియా వాడకం వల్ల ఎరువుల ఖర్చు తగ్గి లాభాలు పెరుగుతాయని, భూసారం కూడా కాపాడవచ్చని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కోనాపూర్ క్లస్టర్ ఏఈఓ జ్ఞానేశ్వర్ సంగోజిపేట్ సర్పంచ్ మంద సంగమేశ్వర్, కోనాపూర్ మాజీ ఎంపీటీసీ.జెట్టి హనుమండ్లు, రాజేశ్వర్ గౌడ్, కటికే దశరథ్తో పాటు పరిసర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఆర్ లో బీకాం విద్యార్థులకు ఏఐ, డిజిటల్ లెర్నింగ్ పై శిక్షణ






**నేటి ప్రభాత దర్శిని**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అధునాతన సాంకేతిక అంశాలను బోధించి, డిజిటల్ లిటరసీని పెంపొందించే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'అన్న అక్క మెంటార్షిప్' టీచింగ్ ఇంటర్న్షిప్ ప్రోగ్రాం లో భాగంగా స్థానిక ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ అటనామస్ కళాశాలలో నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజున బీకాం విద్యార్థులకు 'ఏఐ మరియు డిజిటల్ లెర్నింగ్' పై శిక్షణ ఇవ్వడం జరిగింది. మొదటి రోజు శిక్షణ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అన్న అక్క మెంటార్షిప్' కమ్యూనిటీ ఎంగేజ్మెంట్ టీచింగ్ ఇంటర్న్షిప్ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ ఐదవ సెమిస్టర్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మరియు డిజిటల్ లెర్నింగ్ పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షకులుగా కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగ అధ్యాపకులు జడల రమేష్, ప్రేమ్ చంద్, చౌదరి, వేములవాడ శ్రీనివాస్ మహేందర్ లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ అండ్ అప్లికేషన్స్, కోడింగ్, పైతాన్ లాంగ్వేజ్, డిజిటల్ లర్నింగ్, కంప్యూటేషనల్ థింకింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, టెక్నాలజీని సురక్షితంగా, బాధ్యతాయుతంగా వినియోగించడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కళాశాల నోడల్ అధికారులు మధు రాజేష్ డాక్టర్ ఎం మల్లారెడ్డి ఎం ఆంజనేయులు మాట్లాడుతూ శిక్షణ పొందిన ఐదో సెమిస్టర్ విద్యార్థులు జూలై ఒకటో తేదీ నుండి సెప్టెంబర్ 30 వరకు తమకు కేటాయించిన ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి కేటాయించిన తరగతి విద్యార్థులకు 30 గంటలు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి నితిన్, కామర్స్ విభాగాధిపతి టి రాజయ్య , ఉన్నత విద్య ఐకాస చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, కళాశాల నోడల్ అధికారులు మధు రాజేష్ డాక్టర్ ఎం మల్లారెడ్డి ఎం ఆంజనేయులు, శిక్షకులు చౌదరి, వేములవాడ శ్రీనివాస్, ఎం ఆంజనేయులు, జడల రమేష్, ప్రేమ్ చంద్, అటనామస్ సమన్వయకర్త మరియు స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి ఐక్యుఏసి సమన్వయకర్త హర్ జ్యోత్ కౌర్, అధ్యాపకులు డాక్టర్ కరుణాకర్, డాక్టర్ ఎం ప్రభాకర్, రాజు, శంకరయ్య, డాక్టర్ ఆర్ రామకృష్ణ డాక్టర్ అర్జున్, డాక్టర్ బి నరేష్ , ఏం శిరీష, అరవింద్, నర్మద, రాములు, మల్లేశం, పూర్ణచందర్, ఎం శిరీష, గౌతమి, ప్రజ్ఞ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయుల సర్దుబాటులో నిబంధనలు పాటించాలి

### టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్



**నేటి ప్రభాతదర్శిని రాజన్న సిరిసిల్ల జూన్ 23 :**

టీఆర్టీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ ఉపాధ్యాయుల సర్దుబాటులో నిబంధనలు పాటించుటతో పాటు జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించవలెనని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి గారు అందుబాటు లేనందున సూపరింటెండెంట్ భూపతి రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఆర్టీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ... మన రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత సంవత్సరం జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటులో ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా అమలు కాకపోవడం వల్ల అనేక మంది ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. కావున ఈ విద్యా సంవత్సరంలో సర్దుబాట్లు చేపట్టే సమయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. నార్మ్స్ ప్రకారం మొదట స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో, తరువాత మండల స్థాయిలో, ఆపై ప్రక్క మండలాలలో, చివరిగా మాత్రమే జిల్లా స్థాయిలో సర్దుబాట్లు చేపట్టవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. గత సంవత్సరం ఇతర మండలాలలో సర్దుబాటు చేయబడిన ఉపాధ్యాయులను వారి స్వంత మండలాలకు లేదా సమీప ప్రాంతాలకు సర్దుబాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుతం జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న క్రింది సమస్యలను అత్యవసరంగా పరిష్కరించవలసిందిగా కోరారు. ప్రధాన సమస్యలైన ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు సంపాదిత సెలవులు (జూా) ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల పెండెన్సీని తొలగించాలన్నారు. సరెండర్ లీవ్ బిల్లులను వెంటనే ఆమోదించి చెల్లింపులు చేయాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల సమస్యలను పరిష్కరించి అదనపు ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ఉపాధ్యాయుల సేవా సంబంధిత ఫైళ్లు, ఇంక్రిమెంట్లు, పీఆర్సీ, జీపీఎఫ్, సీపీఎస్/ఎన్‌పీఎస్ సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. పై సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకొని ఉపాధ్యాయులకు న్యాయం చేయవలసిందిగా తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్, రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ తరపున కోరారు. ఈ కార్యక్రమంలో టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతుగంటి రమేష్ రాష్ట్ర కౌన్సిలర్ గోలి రాధాకిషన్, ఎల్లారెడ్డిపేట మండలం ప్రధాన కార్యదర్శి పులి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనం - అధిక దిగుబడికి పునాది





### రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**నేటి ప్రభాతదర్శిని జనగామ జూన్ 23 :**

రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. మంగళవారం, జిల్లాలోని నర్మెట్ట మండలంలో గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను కలెక్టర్ ప్రారంభించి, విత్తన మేళాలో గల ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించేందుకు వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. రైతు వేదికలలో నిర్వహిస్తున్న ఈ విత్తన మేళాల్లో సన్న వడ్లు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డిఏపి వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో యూరియాను అధిక మోతాదులో వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటుందని, శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. ప్రతి గ్రామంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉండేలా తగిన నిల్వలు ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో సుమారు 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే సుమారు 1.5 లక్షల మెట్రిక్ టన్నుల అధిక ధాన్యం కొనుగోలు జరిగిందని పేర్కొన్నారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించడానికి నాణ్యమైన విత్తనం అత్యంత కీలకమని, మంచి పంటకు విత్తనమే పునాది అని పేర్కొన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార విక్రయ కేంద్రాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయకుండా, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలు, ధృవీకరించిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు సేకరించాలని సూచించారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు, ధృవీకరణ పత్రాలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. విత్తన మేళాల్లో రైతులకు అందుబాటులో ఉన్న వివిధ రకాల పంట వంగడాలు, వాటి ప్రత్యేకతలు, దిగుబడి సామర్థ్యం, తెగుళ్ల నిరోధకత వంటి అంశాలపై వ్యవసాయ అధికారులు పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. రైతులు తమ భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వాతావరణ మార్పులు, అస్థిర వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే, వర్షాభావాన్ని తట్టుకునే వంగడాలపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా రైతులు ఆర్థికంగా మరింత స్థిరత్వాన్ని పొందగలరని తెలిపారు. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్యం, ఎరువుల వినియోగం, పురుగు మందుల నిర్వహణ వంటి అంశాలపై శిక్షణా



కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రాధాన్యత అని, నాణ్యమైన విత్తనాల సరఫరాలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అన్నారు. ప్రతి రైతు శాస్త్రీయ సాగు విధానాలను అనుసరిస్తూ, వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల సాగు చేపడితే దిగుబడులు పెరగడంతో పాటు వ్యవసాయ వ్యయాలు తగ్గుతాయని కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన విత్తనం, సరైన సాగు పద్ధతులు, సమయానుకూల వ్యవసాయ సలహాలతో రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఉద్యానవన పంటల సాగు ద్వారా రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని, వాటి ప్రయోజనాలపై గ్రామస్థాయి రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా రైతు వేదిక ప్రాంగణంలో మొక్కలు నాటారు. అలాగే మహిళా రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి, నిర్వహణ, విక్రయాల తీరును పర్యవేక్షించి, కేంద్రం మరింత సమర్థవంతంగా పనిచేసేలా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, సర్పంచ్ శ్రీధర్ గౌడ్, ఎంపీడీవో, ఏడీఏ, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పిటిషన్స్ కమిటీ చర్చ

### నిర్దిష్ట సమయంలో పరిష్కారానికి చొరవ

### కమిటీ చైర్మన్ రఘురామకృష్ణంరాజు

**విశాఖపట్నం,జూన్23(నేటి ప్రభాతదర్శిని):**

శాసనసభ పిటిషన్స్ కమిటీ సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారంపై విస్తృతంగా చర్చించినట్లు కమిటీ చైర్మన్ రఘురామకృష్ణంరాజు తెలిపారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమర్పించిన పిటిషన్లపై సుదీర్ఘంగా చర్చించామని చెప్పారు. ప్రతి సమస్య పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితిని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులను నేరుగా సమావేశానికి తీసుకువచ్చి వారి అభిప్రాయాలను తెలుసుకున్నామని పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో సమస్యలను పరిష్కరించేందుకు కమిటీ కృషి చేస్తోందన్నారు. విశాఖ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కూడా పలు ప్రజా సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వివిధ అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేసినట్లు చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు లాగా ఎమ్మెల్యేలు మరింత చొరవ చూపి సమస్యలను కమిటీ దృష్టికి తీసుకురావాలని రఘురామకృష్ణంరాజు కోరారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సమావేశాలను నిర్వహిస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో చర్చించిన సమస్యలను వచ్చే రెండు నుంచి మూడు నెలల్లో పరిష్కరించేలా చర్యలు చేపడతామని రఘురామ స్పష్టం చేశారు.